క్లుప్తంగా

ఎడ్లబండ్ల పోటీలు


పోటీల్లో గెలుపొందిన పెంచాల లక్ష్మణ్

మందమర్రిరూరల్: మండలంలోని పొన్నారంలో బుధవారం సురిమిల్ల భానయ్య స్మారకార్థం ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 20ఎడ్లబండ్లు పాల్గొనగా పొన్నారం గ్రామానికి చెందిన పెంచాల లక్ష్మణ్ మొదటి స్థానం, ఇందారం గ్రామానికి చెందిన నెల్లి దీప్‌కుమార్ రెండో స్థానం, చిర్రకుంటకు చెందిన మారుతి మూడో స్థానంలో నిలిచారు. వీరికి మొదటి బహుమతిగా రూ.10వేల విలువైన బంగారం, రెండో బహుమతిగా 7తులాల వెండి, మూడో బహుమతిగా 5తులాల వెండి విజేతలకు నిర్వాహకులు సురిమిల్ల శ్రీను, జెడ్పీటీసీ వేల్పుల రవి అందించారు. ఉప సర్పంచ్ రవీందర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

17న రక్తదాన శిబిరాలు

మంచిర్యాలటౌన్: సీఎం కేసీఆర్ పుట్టినరోజు ఈ నెల 17వ తేదీని పురస్కరించుకుని బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, సీఎం అభిమానులు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించి, రక్తసేకరణ చేయడం వల్ల జిల్లాలోని తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధితో బాధపడే వారికి రక్తం అందించేందుకు వీలవుతుందని, గర్భిణులకు, డయాలసిస్, రక్తహీనతతో బాధపడే వారికి రక్తం ఎక్కించేందుకు అవకాశం ఉంటుందని, రక్తదానానికి ముందుకు రావాలని కోరారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/నస్పూర్: పట్టణ పరిధిలోని 14వ వార్డు గాంధీనగర్‌లో బుధవారం డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ హాథ్ సే హాథ్ అభియాన్ జోడో యాత్ర నిర్వహించారు. హాజీపూర్‌లోని నర్సింగాపూర్‌లో కాంగ్రెస్ పతాకాన్ని ఆవిష్కరించి యాత్ర ప్రారంభించారు. కాలనీలోని ప్రతీ ఇంటికీ తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం అని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సుధాకర్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ వేణు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ కల్పించాలి

బెల్లంపల్లి: చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించకుండా తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని తెలంగాణ మహిళ సమాఖ్య(ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) జిల్లా కార్యదర్శి రేగుంట చంద్రకళ అన్నారు. బెల్లంపల్లి పట్టణ సీపీఐ కార్యాలయంలో బుధవారం మహిళ సమాఖ్య పట్టణ మూడో మహాసభను నిర్వహించారు. ఈ మహాసభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 33శాతం రిజర్వేషన్ కోసం ఏళ్ల తరబడి నుంచి పోరాటాలు చేస్తున్నా పాలక ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించడం లేదని విమర్శించారు. మహిళల రక్షణ కోసం ప్రతి మండలంలోనూ మహిళ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని, మహిళల కోసం ప్రత్యేకంగా కోర్టును ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

శేషగిరిరావు వర్ధంతి


నివాళులర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మందమర్రిరూరల్/రామకృష్ణాపూర్/శ్రీరాంపూర్: దివంగత ఏఐటీయూసీ నేత కామ్రేడ్ శేషగిరిరావు వర్ధంతిని శ్రీరాంపూర్ ఆర్కే 6 గనిపై, మందమర్రి ఏరియాలోని ఆర్‌కే1ఏ గనిపై, మందమర్రి ఏరియాలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆ యూనియన్ నేతలు ఘనంగా నిర్వహించారు. శేషగిరిరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఆ యూనియన్ శ్రీరాంపూర్‌లో డెప్యూటీ ప్రధాన కార్యదర్శి కే.వీరభద్రయ్య, కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య, ఆర్కేపీలో ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి సురమల్ల వినయ్, గోవిందుల రమేష్, గట్టయ్య, రమేష్, రాజు, మందమర్రిలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, సుదర్శన్, శ్రీనివాస్, తిరుపతి, ప్రభాకర్, సంపత్ రవి తదితరులు ఉన్నారు.

పోస్టు కార్డుల ద్వారా విద్యార్థుల వినతి



కోటపల్లి: ఫిబ్రవరి 1వ తేదీ నుంచి మా పాఠశాలలో ఉపాధ్యాయులు తెలుగు, హిందీ పాఠాలు బోధించడం లేదంటూ మండలంలోని మల్లంపేట జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో బుధవారం విద్యార్థులు వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. భాషా పండితుల సమస్యలు తీర్చాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పోస్టుకార్డుల ద్వారా వినతి తెలియజేశారు. న్యాయం చేయాలని ఉత్తరాలు రాశారు.

సంత్ సేవాలాల్ జీవితం ఆదర్శం


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రేఖా నాయక్

జన్నారం: బంజారా కులస్తుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జీవితం నేటి యువతరానికి ఆదర్శమని ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీర రేఖానాయక్ అన్నారు. సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా బుధవారం బంజారా సేవసమితి ఆధ్వర్యంలో ధర్మారం చౌరస్తా వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రం ఏర్పాటయ్యాక గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా చేసి అభివృద్ధి చేసినట్లు తెలిపారు. బంజారా యువకులు సేవాలాల్ మార్గంలో నిలిచి మంచిపేరు సంపాదించాలని సూచించారు. బంజారా భవనానికి భూమి కేటాయించనున్నట్లు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షులు భీంలాల్ నాయక్, సంఘం నాయకులు ప్రకాశ్ నాయక్, తిరుపతి, తహసీల్దార్ కిషన్, ఏఎంసీ చైర్మన్ పద్మ, వైస్ చైర్మన్ రాజేష్ యాదవ్, రైతు బంధు సమితి అధ్యక్షులు రాజారాం రెడ్డి, వైస్ ఎంపీపీ వినయ్ కుమార్, కో ఆప్షన్ సభ్యుడు మున్వర్ ఆలీఖాన్, డైరెక్టర్ భరత్ కుమార్, నాయకులు జనార్దన్, బంజారా సంఘం నాయకులు సందేష్, తదితరులు పాల్గొన్నారు.

బంజారాల భోగ్‌బండార్

భీమారం: సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా బుధవారం మండలంలోని బూర్గుపల్లిలో లంబాడా(బంజారా)లు భోగ్‌భండార్ కార్యక్రమం నిర్వహించారు. సేవాలాల్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల ప్రసాదాలు తయారు చేసి భోగ్‌భండార్ జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ బుక్యా రాజ్‌నాయక్ ప్రారంభించారు. చెన్నూర్ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ బుక్యా రాజ్‌కుమార్ మాట్లాడుతూ అందరూ సేవాలాల్ మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. అనంతరం జైపూర్ పవర్‌ప్లాంట్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ పంతులు నాయక్‌ను శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బుక్యా లక్ష్మణ్, బుక్యా రాజేష్, శంకర్‌నాయక్, ఇస్లావత్ గణేష్, అశోక్, రామారావుతో పాటు లంబాడా కుటుంబాలు పాల్గొన్నాయి.


బూర్గుపల్లిలో పూజలు చేస్తున్న లంబాడాలు

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే మైదానాలు

- మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు


క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలటౌన్: క్రీడలను ప్రోత్సహించి, క్రీడాకారులను తయారు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అందులో భాగంగానే మున్సిపాలిటీల్లో, గ్రామాల్లో క్రీడా మైదానాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని పాతమంచిర్యాలలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 6ఎకరాల్లో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడా మైదానాలను ఏర్పాటు చేయడం వల్ల స్థానికంగా ఉండే వారికి పలు రకాల క్రీడల్లో శిక్షణ పొందేందుకు అవకాశం ఉంటుందని, దీంతో జిల్లా నుంచి క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని జిల్లాకు పేరు తీసుకురావాలన్నారు. క్రికెట్‌తో పాటు, ఇతర క్రీడలను ఈ మైదానంలో ఆడుకునేలా అభివృద్ధి చేస్తామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వార్డు కౌన్సిలర్ బొలిశెట్టి సునిత, సింగిల్ విండో చైర్మన్ సందెల వెంకటేశ్, కౌన్సిలర్లు, పాతమంచిర్యాల స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిరంతరం కృషి

నస్పూర్: పట్టణాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే దివాకర్‌రావు తెలిపారు. పట్టణ ప్రగతి నిధుల నుంచి రూ.90లక్షలతో కొనుగోలు చేసిన స్వీపింగ్ మిషన్, హైడ్రాలిక్ గ్లాడర్, వైకుంఠ రథాలను బుధవారం ఆయన సీసీసీ కార్నర్ వద్ద ప్రారంభించారు. నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీల్లో అన్ని వార్డులపై దృష్టి సారించి, అభివృద్ధి పనులు వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, కమిషనర్ రమేశ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రజలకు పరిహారం చెల్లించాలి


సమస్యలు తెలుసుకుంటున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో వరద ముంపునకు గురైన ముంపు ప్రాంత ప్రజలకు నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ అన్నారు. «ప్రజాగోస బీజేపీ భరోసా» కార్యక్రమంలో భాగంగా రెండో రోజు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గతేడాది వరద ముంపు ప్రాంతాలైన గణేష్‌నగర్, పద్మశాలి కాలనీ, ఎల్ఐసీ కాలనీ, రాంనగర్, ఎన్టీఆర్‌నగర్, కాలేజీరోడ్డు ప్రాంతాల్లో బుధవారం పాదయాత్ర చేపట్టారు. ప్రజల సమస్యలు తెలుసుకుని స్ట్రీట్ కార్నర్ సమావేశాల్లో పాల్గొని మాట్లాడుతూ మంచిర్యాలలో వరదలు వచ్చి 8నెలల' దాటినా ఇప్పటి వరకు బాధిత ప్రజలకు నష్టపరిహారం చెల్లించలేదన్నారు. ఎమ్మెల్యే దివాకర్‌రావుకు భూకబ్జాలు, కమీషన్‌ల మీద ఉన్న ప్రేమ వరద బాధితుల మీద లేదని ఆరోపించారు. వరద ప్రభావిత ప్రాంత బాధితులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించి రూ.10వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, ముల్కల్ల మల్లారెడ్డి, పెద్దపల్లి పురుషోత్తం, ఆకుల అశోక్‌వర్దన్, పోశం, రేకందర్ వాణి, మల్లేశ్, కిషోర్, అమిరిశెట్టి రాజు, రాజమౌళి, అశోక్, రాకేశ్ పాల్గొన్నారు.

బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ సమావేశం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కన్నెపల్లిలో 141, 142, 143బూత్‌ల్లో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో 'ప్రజాగోస బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'భూకబ్జాల ఎమ్మెల్యేను ఇంటికి సాగనంపండి'

కాసిపేట: ప్రజల సమస్యలు పట్టించుకోకుండా భూకబ్జాలకు పాల్పడుతున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యను ఓటర్లు ఇంటికి సాగనంపాలని బీజేపీ బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి కొయ్యల ఏమాజీ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం ప్రజా గోసా– బీజేపీ భరోసా కార్యక్రమం నిర్వహించారు. ప్రధాని మోదీ హయాంలో దేశంలో అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతి, పోశం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేశవరెడ్డి, జిల్లా కార్యదర్శి గోవర్ధన్, నాయకులు రాజులాల్ యాదవ్, శ్రావణ్‌కుమార్, సంపత్, పురుషోత్తం, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ రైతులకు సత్కారం


అవార్డు అందిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

బెల్లంపల్లి: మంచిర్యాల జిల్లాకు చెందిన పలువురు ఉత్తమ రైతులకు సత్కారం చేశారు. రేడియో దివస్ ను పురస్కరించుకుని బుధవారం ఆలిండియా రేడియో ఆదిలాబాద్ కేంద్రంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం సూచనలు, సలహాలు పాటించి వ్యవసాయంలో రాణిస్తున్న ఉత్తమ రైతులను గుర్తించి అవార్డులు ప్రకటించారు. అవార్డులు అందుకున్న వారిలో దండేపల్లి మండలం నాగసముద్రం గ్రామానికి చెందిన మహిళ రైతు సుగుణ, కాసిపేట మండలం సంద్రలపాడ్ గ్రామ రైతు దాడి పెంటయ్య, బెల్లంపల్లి మండలం పెర్కపల్లి గ్రామానికి చెందిన బుద్దే లావణ్య అవార్డులు అందుకున్నారు. వీరికి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అవార్డులు అందజేసి, శాలువాతో సత్కరించారు. కేవీకే సేవలను, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించి వ్యవసాయంలో మరింతగా రాణించేందుకు రైతులు చర్యలు తీసుకోవాలని కేవీకే ప్రధాన శాస్త్రవేత్త రాజేశ్వర్ నాయక్ కోరారు.

'ఉపాధి' పనులపై సమీక్ష


మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

భీమారం: మండలంలో చేపడుతున్న ఉపాధిహామీ పథకం పనులు వేగంగా చేపట్టాలని ఎంపీడీవో శ్రీనివాస్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పనులపై బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మంజూరు చేసిన పనులను సత్వరమే కూలీల ద్వారా పూర్తి చేస్తేనే కొత్త పనులు మంజూరవుతాయన్నారు. క్షేత్రస్థాయిలో పనులను దగ్గరుండి చేపట్టాలని కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీవో సతీష్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీఎం ఎస్తర్‌డేవిడ్‌తో పాటు కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అధికారం మాటున అక్రమంగా పనులు


సిబ్బందిని విచారిస్తున్న ఎంపీవో సత్యనారాయణ

తాండూర్: మండలంలోని రేచిని గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడు గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను సొంత అవసరాలకు వినియోగించడం వివాదాస్పదంగా మారింది. మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా వ్యవహరిస్తున్న సుబ్బా దత్తుమూర్తి రెండు రోజుల క్రితం తన ఆయిల్‌ఫాం తోటకు వాటర్ ట్యాంకర్‌తో నీటి తడులు అందించడంతో కొంత మంది యువకులు ఫొటోలు తీసి సోషల్‌మీడియాలో పెట్టారు. దీంతో దత్తుమూర్తి వ్యవహారం వెలుగు చూసింది. గతంలోనూ ఆయనపై అనేక ఆరోపణలు వచ్చాయి.

ఆది నుంచి అదే తీరు..

అధికారాన్ని అడ్డం పెట్టుకుని గతంలో సింగిల్ విండో చైర్మన్ హోదాతో సివిల్ వర్క్స్‌ను వ్యవసాయ పనులు చేయించుకున్నాడు. గతేడాది తన ఇంటి వద్ద జరిగిన పూజా కార్యక్రమంలో పంచాయతీ సిబ్బందితో పందిరి వేయించడం, తోరణాలు కట్టించడం అప్పట్లో చర్చనీయాంశమైంది. గ్రామ పంచాయతీ నిధులు రూ. 40వేలతో కల్వర్టు నిర్మాణాల పనులకు ప్రతిపాదించారు. ఈ పనులను బినామీ కాంట్రాక్టర్‌కు అప్పగించి పంచాయతీ కార్మికులతో పనులు చేయించినట్లు ఆరోపణలు వచ్చాయి.

ట్రాక్టర్ వినియోగంపై విచారణ

దత్తుమూర్తి తన వ్యవసాయ క్షేత్రంలో పంచాయతీ ట్రాక్టర్‌ను వినియోగించిన ఘటనపై బుధవారం మండల పంచాయతీ అధికారి సత్యనారాయణ విచారణ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బందిని ఎంపీవో వేర్వేరుగా విచారించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపించామని, వారి ఆదేశాల ప్రకారంగా చర్యలు తీసుకుంటామని ఎంపీవో సత్యనారాయణ తెలిపారు.

ఉర్సు ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

- నేటి నుంచే ప్రారంభం
- ముస్తాబైన దర్గా


ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు, పోలీసులు

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలోని పోస్టాఫీస్ ఎదురుగా గల హజ్రత్ సయ్యద్ షా బాబా రహమతుల్లా అలై ఉర్సు ఉత్సవాల కోసం సయ్యద్ షా బాబా దర్గాను ముస్తాబు చేశారు. గురువారం నుంచి శుక్రవారం వరకు రెండు రోజుల పాటు జరిగే ఉర్సు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉర్సు కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలకు పట్టణ ప్రజలే కాకుండా మహారాష్ట్రంలోని సిరోంచ, నాగాపూర్, బల్లార్షతో పాటు మంచిర్యాల జిల్లా నుంచి వేలాది మంది తరలి రానుండగా పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం కల్పించిన సౌకర్యాలను సీఐ ప్రవీణ్‌కుమార్‌తో పాటు మున్సిపల్ కమిషనర్ గంగాధర్, మున్సిపల్ వైస్‌చైర్మన్ నవాజ్, ఎస్సై చంద్రశేఖర్, బీఆర్ఎస్ నాయకులు రాంలాల్‌గిల్డా పరిశీలించారు. గురువారం గంధం సందర్భంగా సాయంత్రం 5గంటలకు సయ్యద్ షా బాబా ఊరేగింపు అనంతరం దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి రాత్రి 8గంటలకు ఉర్సును ప్రారంభిస్తారు. శుక్రవారం రెండో రోజు కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు దర్గాను దర్శించుకొని అగరత్తులు, మిఠాయిలు సమర్పించి మొక్కులు చెల్లిస్తారు. రెండు రోజుల పాటు రాత్రి 10గంటల నుంచి ముంబాయి, నాగాపూర్‌కు చెందిన ప్రముఖ కళాకారులు మజీద్ షోలా, రుబీతాజ్‌ల ఆధ్వర్యంలో కవ్వాలి ఉంటుందని ఉర్సు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నవాజోద్దీన్ తెలిపారు.

బీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే చిన్నయ్య


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లిరూరల్: బీఆర్ఎస్ పాలనతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మండలంలోని లంబాడితండాలో రూ.10లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సత్యనారాయణ, ఎంపీపీ శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ సుదర్శన్, ఎంపీడీవో రాజేందర్, సర్పంచ్ రాయమల్లు, ఎంపీటీసీలు శకుంతల, సుభాష్ రావు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు' వినియోగించుకోవాలి

భీమిని: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కోరారు. కన్నెపల్లి మండలంలోని గొల్లగట్టు గ్రామంలో బుధవారం కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్‌గుప్తా, కన్నెపల్లి జెడ్పీటీసీ సత్యనారాయణ, రైతు సమన్వయ సమితి కన్వీనర్ శ్రీరామారావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఆకుతోట రాజన్న, సర్పంచ్ ఆకుతోట బుచ్చక్క, తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఆశన్న

పాతమంచిర్యాల: పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆశన్న డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం జిల్లా కమిటీ నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ మంచిర్యాల, క్యాతనపల్లి, మందమర్రి మండలాల్లో డబుల్ బెడ్రూం ఇళ్లు పూర్తయ్యాయని, వాటిని పేదలకు కేటాయించాలన్నారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికులు, అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కమిటీ సభ్యులు ప్రకాశ్, రాజేశ్వరి, ఎర్మ పున్నం, రంజిత్‌కుమార్, శ్రీనివాస్, అశోక్, చందు, రాజారాం పాల్గొన్నారు.

'కార్పొరేట్ కళాశాలల ప్రచారాన్ని అడ్డుకుంటాం'

మంచిర్యాలఅర్బన్: ఇంటర్ అడ్మిషన్ కోసం జిల్లాకు వచ్చే కార్పొరేట్ కళాశాలల ప్రచారాన్ని అడ్డుకుంటామని పలు విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. మంచిర్యాలలో బుధవారం మాట్లాడుతూ అడ్మిషన్ల సమయంలో తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్న కార్పొరేట్ యాజమాన్యాలు భోజనం, వసతులు అందించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. విద్యార్థుల మృతులకు కారణమవుతున్న కళాశాలలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలి


పనులు పరిశీలిస్తున్న కాంతయ్య

లక్సెట్టిపేట: మహాశివరాత్రిని పురస్కరించుకొని లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని గోదావరి స్నానానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య అధికారులను ఆదేశించారు. గోదావరి తీరంలో బుధవారం ఆయన పర్యటించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, సురేష్‌నాయక్, మెట్టు రాజు, కార్యాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని ముల్కల్ల గోదావరి పుష్కరఘాట్‌ను బుధవారం సర్పంచ్ శ్రీనివాస్, ఎస్సై ఉదయ్‌కిరణ్ సందర్శించారు. మహాశివరాత్రి పురస్కరించుకుని భక్తుల కోసం కల్పించే సౌకర్యాలను పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకున్నారు.

హనుమాన్ మందిర్‌లో ప్రసాద వితరణ

చెన్నూర్: పట్టణంలోని గోదావరి తీరా హనుమాన్ మందిర్ ప్రాంగణంలో మహాశివరాత్రి సందర్భంగా శనివారం ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఓంప్రకాశ్ అసావా, రాజేందర్ అసావాలు తెలిపారు. ఏటా నిర్వహిస్తున్న ప్రకారం ఈ ఏడాది యాత్రికులకు ప్రసాద వితరణ ఏర్పాటు చేస్తున్నామని, భక్తులు ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు పరిశీలన


ఏర్పాట్లు పరిశీలిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: కృష్ణాకాలనీలోని శాంతి మైదానంలో గురువారం జరిగే ఆర్కే 5, ఆర్కే 6 గనుల విస్తరణకు సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణకు సంబంధించిన ఏర్పాట్లను జీఎం సంజీవరెడ్డి బుధవారం ఏరియా ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. షామియానా, కుర్చీలు, వేదిక వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీటి వసతి కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటూ జీఎం త్యాగరాజు, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, డీజీఎంలు గోవిందరాజు, చిరంజీవి, శివరావు, ఏజెంట్ ఏవీ రెడ్డి, గనుల మేనేజర్లు అబ్దుల్‌ఖాదీర్, ఈ తిరుపతి, డెప్యూటీ సీఎంఓ రమేశ్‌బాబు, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎన్విరాన్‌మెంట్ అధికారి హనుమాన్‌గౌడ్, ఫారెస్టు అధికారి రమణారెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నియామకం

భీమారం: మండల కేంద్రంలో శ్రీ మల్లికార్జున యాదవ సహకార సంఘానికి బుధవారం నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఆవుల సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మంచిర్యాల సహకార సంఘాల అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవీందర్‌రావు తెలిపారు. ఉపాధ్యక్షుడిగా కొమ్ము నాగరాజ్, ప్రధానకార్యదర్శిగా మెండె మల్లేశ్, కోశాధికారిగా దారవేణి తిరుపతితోపాటు పలువురిని డైరెక్టర్లుగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

లో ఓల్టేజీ సమస్య పరిష్కారం

చెన్నూర్: మున్సిపాలిటీలోని 5వ వార్డు పరిధిలో గల ఇందిరానగర్ కాలనీ వాసులు పడుతున్న లో ఓల్టేజీ సమస్య పరిష్కారమైంది. గతంలో 15కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో లో ఓల్టేజీతో సమస్య ఉందని కాలనీ వాసులు, కౌన్సిలర్ నసీమాబేగంఆరీఫ్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించారు. ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించడంతో కాలనీవాసులు కౌన్సిలర్‌ను అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బోనాల సందడి

చెన్నూర్‌రూరల్: మహాశివరాత్రి సమీపిస్తున్నందున మండలంలోని కత్తెరసాల గ్రామంలోని శ్రీ మల్లిఖార్జున స్వామి ఆలయానికి బుధవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బోనాలు పోసి తీపి పదార్థాలతో స్వామి వారికి నైవేద్యం పెట్టారు. ఒగ్గు పూజారులు పట్నాలు వేశారు. శివ సత్తుల పూనకాలతో ఆలయ ఆవరణ మారుమోగింది.

నర్సరీల సందర్శన

కోటపల్లి: పంచాయతీల్లో చేపడుతున్న నర్సరీ నిర్వహణ సక్రమంగా ఉండాలని ఎంపీడీవో భాస్కర్ సూచించారు. మండలంలోని పంగిడిసోమారం గ్రామంలోని నర్సరీని బుధవారం పరిశీలించారు. నర్సరీల్లో మొక్కలను జాగ్రత్తగా పెంచాలని, నిర్దేశించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. నర్సరీ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ తులసి, కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

భీమారం: మండలంలోని ఎలకేశ్వరం, భీమారం, మద్దికల్ గ్రామాల్లో హరితహారం కింద పెంచుతున్న నర్సరీలను బుధవారం ఎంపీడీవో శ్రీనివాస్ సందర్శించారు. కార్యక్రమంలో కార్యదర్శి నవ్య ఉన్నారు.